పాఠశాల ఖర్చులపై ఆడిట్

- గతేడాది విడుదలైన నిధులు
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా విడుదల
- నేడు ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రారంభం



సావర్‌ఖెడాలో స్కూల్ గ్రాంట్‌తో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రి



కెరమెరి ఎమ్మార్సీ కార్యాలయం

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఇతర అవసరాల కోసం విడుదల చేసిన నిధులు, ఖర్చుల వివరాలను పరిశీలించేందుకు సోమవారం మండలానికి ఆడిట్ బృందం రానుంది. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి ఆడిట్ ప్రారంభం కానుంది. 2024 -25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ.16 వేల నుంచి రూ.1.68 లక్షల వరకు నిధులు విడుదలయ్యాయి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, క్రీడా సామగ్రి, యూత్ ఎకోక్లబ్, బడిబాట నిర్వహణ కోసం ఈ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొన్ని పాఠశాలల్లో నామమాత్రంగా సామగ్రి కొనుగోలు చేసి ఫేక్ రశీదులు తీసుకోవడంతో పాటు మరికొన్ని పాఠశాలల్లో సొమ్ము జేబుల్లోకి మళ్లిస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిని తనిఖీ చేసేందుకు ఆడిట్ బృందం నేడు మండల కేంద్రానికి రానుంది.

నిధుల విడుదల ఇలా..

మండలంలోని మొత్తం 90 పాఠశాలలు ఉన్నాయి. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 3, ఆశ్రమ ఉన్నత పాఠశాలలు 5, కేజీబీవీ 1, ప్రాథమికోన్నత పాఠశాలలు 4, ప్రాథమిక పాఠశాలలు 77 ఉన్నాయి. వీటిలో 4320 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2024 -25 సంవత్సరంలో మండలంలోని అన్ని పాఠశాలలకు రూ. 29,41,680 నిధులు విడుదల చేశారు. వాటిలో పాఠశాల గ్రాంటు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.10 వేల నుంచి రూ. 75 వేల వరకు ఉండగా.. బడిబాట కోసం ఒక్కో పాఠశాలకు రూ.1000, క్రీడల కోసం రూ.1000, ఉన్నత పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ కోసం రూ.15000, సేఫ్, సెక్యూరిటీ కోసం రూ. 500, యూత్, ఇకో క్లబ్ కోసం రూ. 5000, ఏక్ భారత శ్రేష్ఠ భారత్ కోసం రూ.1000 విడుదలయ్యాయి. అయితే పాఠశాలకు వచ్చే గ్రాంట్ నుంచి ఆరోగ్యం కోసం ఖర్చు చేయాల్సి ఉంది. అంతేకాకుండా ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లకు స్కూల్ కాంప్లెక్స్ గ్రాంటు రూ.33,000, ఎమ్మార్సీ గ్రాంట్ రూ. 86,920 విడుదలైంది.

పాఠశాల కమిటీ ద్వారా..

ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ. 16వేల నుంచి రూ.40 వేల వరకు నిధులు విడుదల చేయగా, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.42,500 నుంచి రూ.67,500 వరకు, ఉన్నత పాఠశాలల్లో రూ.60వేల నుంచి రూ.1.68 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. పాఠశాల కమిటీల ద్వారా ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయుల జాయింట్ అకౌంట్ నుంచి నిధులు విడుదల చేస్తారు. అయితే కొన్ని పాఠశాలల్లో నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో వస్తువులు కనిపించవు, కానీ బిల్లులు మాత్రం రూపొందించారని తెలుస్తోంది.

ఆడిట్ తప్పనిసరి..



అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆడిట్ చేయించుకోవాలి. నేడు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆడిట్ ఉంటుంది. ఖర్చు చేసిన బిల్లులు సకాలంలో ఆడిట్ బృందానికి చూపించి సహకరించాలి. ప్రతీ పాఠశాలకు ఆడిట్ తప్పనిసరి.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

ప్రతీ చెట్టుకు ప్రశంసాపత్రం

కెరమెరి: మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇందుకు పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేస్తోంది. ఇందులో భాగంగా 'ఏక్ పేడ్ మాకే నామ్' అనే కార్యక్రమం ద్వారా ప్రతీ విద్యార్థి తన తల్లి పేరిట ఒక్క మొక్క నాటాలని ప్రోత్సహిస్తోంది. ఇందుకు మొక్క నాటి 'మిషన్ లైఫ్' పోర్టల్ ఫొటోను అప్‌లోడ్ చేసిన వారికి ఆన్‌లైన్‌లోనే మొక్క నాటిన వారి పేరిటా ప్రశంసాపత్రం అందిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 656 మంది విద్యార్థులు మొక్కలు నాటి ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆదివారం కూడా అనేక మంది విద్యార్థులు మొక్కలు నాటారు.



అగుర్‌వాడ పాఠశాలలో మొక్క నాటిన సవంతాబాయి పేరిట అందిన ప్రశంసాపత్రం

విత్తన గణపతులనే పూజిద్దాం



గణపతులు పంపిణీ చేస్తున్న నాయకులు



విత్తన గణపతులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా వినాయక చవితి సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆదివారం విత్తన గణపతిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విత్తన గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అని అన్నారు. విత్తన గణపతులకు పూజలు చేసిన అనంతరం ఇంటి ఆవరణలో నిమజ్జనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గాడ్గే దీపక్, ధీరజ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన రాథోడ్ రాజు ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకున్నారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

విత్తన గణపతులు పంపిణీ

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో ఆదివారం మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆధ్వర్యంలో గ్రామస్తులకు విత్తన గణపతులు పంపిణీ చేశారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా విత్తన గణపతులు పంపిణీ చేసినట్లు తెలిపారు. విత్తన గణపతులను ప్రతిష్ఠాపించి నిమజ్జనాన్ని ఇంటి ఆవరణలో చేయాలని కోరారు. దీంతో గణపతి నుంచి మొక్క మొలుస్తుందన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై మధుకర్

కెరమెరి: అనవసర, అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త పడాలని కెరమెరి ఎస్సై మధుకర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఝరి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటీపీ నంబర్లు తెలియని వారికి చెప్పొద్దని, ఏదైనా అనుమానం వస్తే 1930, 100 నంబర్లకు డయల్ చేయాలని పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, అతి వేగంగా, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బడిగా పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న రైతులు

కౌటాల: మండలంలోని రైతులు, ప్రజలు ఆదివారం బడిగా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రైతులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్టితో ఎద్దులను తయారు చేసి స్థానిక చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. మట్టి ఎద్దుల విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. రైతులు బడిగా పాటలు, నినాదాలు చేయడంతో పండుగ వాతావరణం నెలకొంది.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని మోతుగూడ, బూర్గుడ, బెల్గాం, రాజురతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం బడిగ పండుగను ఘనంగా నిర్వహించా రు. పొలాల పండుగ రోజు మట్టితో తయారుచేసిన ఆవు, దూడ విగ్రహాలకు పూజలు చేసి మరుసటి రో జు కొత్త బట్టలు ధరించి పూజలు చేసిన ఆవు, దూడ విగ్రహాలను నదీతీరంలో నిమజ్జనం చేశారు.

ఇచ్చోడ: మండలంలోని బాదిగూడలో ఆదివారం బడిగా పూజలు నిర్వహించారు. ఆదివారం జాగే మాతరి పండుగ సందర్భంగా వెదురు కర్రలతో గ్రామ పొలిమేరలలో ఇప్ప చెట్టు వద్ద ప్రత్యేక పూ జలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. అనాదీగా వ స్తున్న ఆచారం ప్రకారం.. అటవీ ప్రాంతం నుంచి తీసుకువచ్చిన పలు రకాల వనమూలికల పొగ పె ట్టి పీల్చారు. ఇలా చేయడం ద్వారా రోగాలు నయమవుతాయని ఆదివాసీల నమ్మకం. కార్యక్రమంలో గ్రామపటేల్ సిడాం లక్ష్మికాంత్‌రావు, పెందుర్ బండు, పెందుర్ యాదవ్‌రావు, మెస్రం అమృత్‌రావు, సిడాం రాజేందర్, పెందుర్ అశోక్ పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌పై మొక్కలు



ఫ్లైఓవర్‌పై పెరిగిన మొక్క

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వే ఫ్లెఓవర్ గోడలపై మర్రి, రావి మొక్కలు మొలకెత్తుతున్నాయి. అయినా.. సంబంధిత అధికారులు, సిబ్బంది తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కలు ఏపుగా పెరిగితే ఫ్లైఓవర్ దెబ్బతినే అవకాశం ఉంది. అధికారులు వెంటనే స్పందించి మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి, కొండపల్లి గ్రామాల్లో కోడిపందేలా స్థావరాలపైన ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు. 5 పందెం కోళ్లు, రూ. 2320 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని ఒకరు మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయిగూడ గ్రామం వద్ద ఆదివారం రాత్రి బైక్ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుట్ట గ్రామానికి చెందిన ఆత్రం పోశన్న బొంబాయి గూడలో పనులు ముగించుకొని కాలినడకన తన గ్రామానికి వెళ్తున్న క్రమంలో పోతేపల్లి గ్రామానికి చెందిన ఎల్కరీ శ్రీకాంత్ అతివేగంగా బైక్‌తో పోశన్నను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో పోశన్న తలకు బలమైన గాయాలు కాగా శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా పోశన్న మృతి చెందాడు. పోశన్న భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవానీ జాతరకు పోటెత్తిన భక్తులు



జాతరలో వెలసిన దుకాణాలు



గుట్టపైన భవానీమాతను దర్శించుకుంటున్న భక్తులు

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ శివారులో నిర్వహించిన భవానీ జాతరకు భక్తులు తరలివచ్చారు. ప్రతీ సంవత్సరం పొలాల అమావాస్య మరుసటి రోజు నిర్వహించే 'బడిగ' పండుగ పురస్కరించుకుని జాతరను నిర్వహిస్తారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాల ప్రజలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా చేరుకున్నారు. సరాండి గ్రామ సమీపంలోని గుట్టపై వెలసిన భవానీ మాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల తాకిడితో గుట్ట కింద నిర్వహించిన జాతర జనాలతో కిక్కిరిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పట్టుబడిన కలప పక్కదారి

- చలాన్ల పేరుతో అక్రమ వసూళ్లు
- డిపోకు తరలించకుండా ప్రైవేట్ పరం
- ధనార్జనే ధ్యేయంగా విధులు



కార్పెంటర్ ఇంట్లో పట్టుకున్న కలప (ఫైల్)

బెజ్జూర్: అడవిని కాపాడాల్సిన అధికారి గత కొన్ని సంవత్సరాలుగా ఒకే చోట ఉంటూ అక్రమాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. అటవీ రక్షణ పేరుతోనే అక్రమ రవాణా జరిపి అందినకాడికి దండుకుంటున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. మారుమూల గ్రామస్తుల వద్ద పట్టుబడిన కలప దుంగల కేసులో అధిక డబ్బులు వసూలు చేసి, లెక్కల్లో కేవలం సగం మాత్రమే చూపించినట్లు సమాచారం. మిగితా మొత్తాన్ని అధికారి స్వాహా చేస్తున్నాడు. పట్టుబడిన టేకు కలప వాటిని డిపోకు తరలించకుండా ప్రైవేటు వ్యక్తులకు అమ్ముతున్నట్లు సమాచారం.

పట్టుకున్న కలప.. ప్రైవేట్‌కు..

వివిధ కేసుల్లో పట్టుబడిన కలప డిపోకు తరలించాల్సిన సదరు అధికారి దాన్ని పక్కదారి పట్టిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఐదుగురు వ్యక్తులు నరికిన కలప దుంగను డిపోకు తరలించాల్సి ఉండగా, ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నట్లు సమాచారం. కిందిస్థాయి అధికారులు ఇదేమిటని ప్రశ్నిస్తే.. తనకు రేంజ్ కొన్ని సంవత్సరాల సీనియారిటీ ఉందని, నా మాట మారు వినాలని దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తోంది. వారానికి ఒక్కసారి మాత్రమే విధులకు హాజరవుతున్నాడని సమాచారం.

అనేక అనుమానాలు..

మండల కేంద్రానికి చెందిన ఒక కార్పెంటర్ ఇంట్లో పెద్ద మొత్తంలో కలప పట్టుకున్న అధికారులు రూ. 18 వేల విలువ చేసే కలప మాత్రమే పట్టుకున్నట్లు తెలుపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంబగట్టు గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఒక్క చెట్టు కొడితేనే రూ. 60 వేల రూపాయలు తీసుకున్న అధికారులు ఇంత పెద్ద కలప దొరికిన రూ. 18 వేలు తీసుకోవడంపై ఆ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది కార్పెంటర్ ఇంట్లో దొరికిన కలపకు ఏదో సంబంధం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విచారణ చేస్తే అసలు ఏం జరిగిందనేది విషయాలు తెలిసే అవకాశం ఉంది. సంబంధిత బెజ్జూర్ ఎఫ్ఆర్‌వో ముసవీర్ వివరణ కోరగా కార్పెంటర్ ఇంట్లో పట్టుకున్న కలప రూ. 18 వేల విలువ ఉంటుందన్నారు. రూ. 60 వేల రూపాయలు తీసుకుంటే రెండుసార్లు ఇవొచ్చు. రేంజ్ పరిధిలో అక్రమ వసూలు చేసి రసీదు ఇవ్వకుంటే ఫిర్యాదు చేయవచ్చు.

విద్యుత్‌శాఖ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్, బురుగ్గుడా విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని వినియోగదారులకు అందిస్తున్న మెరుగైన సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ లక్ష్మిరాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయకచవితి, దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి తక్షణ సమాచారాన్ని చేరవేసేందుకు డయల్ 1912 వినియోగించుకోవాలన్నారు. సిబ్బందికి సెల్ నంబర్‌లను సైతం కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైనా, ఏమైనా సమస్యలు తలెత్తినా తక్షణమే కింది నంబర్‌లకు సమాచారాన్ని అందించాలని సూచించారు.

ఆసిఫాబాద్ సబ్‌స్టేషన్	87124 86517
బురుగ్గుడా సబ్‌స్టేషన్	87124 86526
శ్రావణ్, లైన్‌మెన్	89784 77112
గోపాల్, అసిస్టెంట్ లైన్‌మెన్ -2	87124 86521
లైన్‌మెన్	87124 86520
లైన్ ఇన్‌స్పెక్టర్	87124 86519
ఫోర్‌మెన్	87124 86518
సబ్-ఇంజనీర్	87124 86522
అసిస్టెంట్ ఇంజనీర్	87124 86516
జగన్ -స్పాట్ బిల్లర్	9441621934
శేఖర్, అన్‌మ్యాన్డ్	81793 58513
గంగయ్య, అన్‌మ్యాన్డ్	9490852110

ధర్మ పరిరక్షణకు ఐక్యంగా ఉండాలి



సమితి సభ్యులను సన్మానిస్తున్న మౌనిష్‌రెడ్డి

ఆదిలాబాద్: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీ హిందువు ఐక్యంగా ఉండాలని సామాజిక కార్యకర్త ముదుపు మౌనిష్ రెడ్డి అన్నారు. శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఆదివారం సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాల క్రితమే శ్రీ బాల గంగాధర్ తిలక్ హిందూ ఐక్యతకు ఎంతగానో కృషి చేశారన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు బండారి వామన్, అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, పడకంటి సూర్యకాంత్, కందుల రవీందర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



పార్టీలోకి స్వాగతం పలుకుతున్న మాజీ ఎంపీ

తలమడుగు: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు, బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని దేవాపూర్ గ్రామంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత పదేళ్ల కాలంలో పేదలకు ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, పూర్తయిన వెంటనే బిల్లులు కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, గోక గణేష్ రెడ్డి, బాబన్న, ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావు, పోతరెడ్డి, రూపేష్ రెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత

తలమడుగు: ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీ, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు, డీసీసీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కజర్ల గ్రామంలో నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత అఖండ జ్యోతిలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేయనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రమే శ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రేషన్ కార్డుల పంపిణీ వైఫల్యంపై, ఆధార్ కార్యాలయం తొలగించడంపై, మహిళలకు నెలకు రూ. 2500, ఇందిరమ్మ ఇళ్ల అమలులో విఫలమైనందున ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేశ్, పతంగే బ్రహ్మానంద వస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుండెపోటుతో ఒకరు మృతి

రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్‌కు చెందిన దుర్గం మోహన్‌రావు (38) అనే వ్యక్తి ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో బిజినెస్ చేసుకుంటూ జీవించే మోహన్‌రావు పొలాల పండుగ సందర్భంగా భార్య తేజవాత్ భానుమతి, కుమారుడు క్రితికేష్, చెల్లెలు అనూషలతో కలిసి శనివారం స్వగ్రామం కిష్టాపూర్‌కు వచ్చాడు. ఆదివారం ఉదయం మోహన్ రావు ఇంటి ముందు కూర్చుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని రెబ్బెన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈమేరకు మృతుడి భార్య భానుమతి అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంట నష్టాన్ని ప్రభుత్వమే భరించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: భారీ వర్షాలు, వరదలతో జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వమే భరించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, మణియార్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. పెన్‌గంగ బ్యాక్ వాటర్‌తో దెబ్బతిన్న పత్తి, సోయా, కంది పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి, పంట నష్టంపై ఆరా తీశారు. నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులతో త్వరలోనే స్వయంగా కలిసి పంట నష్టం వివరాలు తెలియజేస్తామన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఇంద్రశేఖర్, దత్తా నిక్కమ్, రామెల్లి మోరేశ్వర్, తాక్రే మురళీధర్, తాక్రే సందీప్, కోడే ప్రదీప్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, తిరుపతి, గజానన్, సంజయ్, తదితరులు ఉన్నారు.

అన్నాబావు సాఠే ఆశయాలు నెరవేర్చాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాఠే ఆశయాలు నెరవేర్చాలని ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. ఆదివారం మండలంలోని దస్నాపూర్‌లో నిర్వహించిన అన్నాబావు సాఠే జయంతికి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెనుకబడిన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామపటేల్ పుండలిక్, నాయకులు నిధన్‌పూరే గోవింద్, కాంబ్లే బాల్‌రాజ్, మోతేవార్ సంభాజీ, ఉత్తం పాల్గొన్నారు.